

# నైజగుణాలు

కథానిక

ఉదయభానుడు రానురాను మండిపడుతున్నాడు అంత కోపం ఎవరిమీదనో! మానవుల వంక చూస్తూ మరీమరీ వేడెక్కిపోతున్నాడు. తన అగ్నిజ్వాలల్లో వీళ్ళంతా మాడి మసి అయిపోవలసిందే. ఎందుకో అంత కోపం. మానవులందరూ వాళ్ళవాళ్ళ పనులు సరిగానే నిర్వర్తించుకొంటున్నారుగా! ఎప్పటికప్పుడు సచ్చి అబద్ధాలు ఆడుతూనే ఉన్నారుగా. అక్రమాలు, అన్యాయాలు, మోసాలు, కృత్రిమాలు...అబ్బ! ఇవన్నీ వాళ్లకు అలవాటే. అందుకనే అతగాడి కంత కోపం. ఇది లౌకిక ప్రపంచమని అతనికి తెలియదూ? అందర్నీ అలాభస్మంచేస్తే మరి అన్యాయాలు అటువంటివి ఉండవూ? పిచ్చిబాబు మళ్ళీ ఆ కోపమంతా పోదూ? క్షణికమైన కోపమేగాని నిజంగా అలా భస్మం చేసేస్తాడా? సంధ్యాశోభల్లో జేవురించిన మొగాన్ని దాచేస్తూ మెల్లమెల్లగా పడమటి కొండల్లోకి వెళ్ళిపోతాడు.

వెళ్ళిన మరుక్షణం జగమంతా తల్లడిల్లిపోతుంది. పక్షుల దీనాలపాలు వినిపిస్తాయి. అంతా అంధకారం. ఎక్కడ చూచినా చీకటే. కాంతిలేని దీపాలు తమ ముఖాన్ని యింత పొగ పులుముకొంటూ దిక్కులు చూస్తున్నయ్. అవన్నీ చీకట్లని పోగొడతాయా. ఆ కాస్త మేర తెల్లముఖం వేసుకొని నిలబడతాయి.

ఆ ఇంటి పంచలో ఒక దీపం వెలుగుతూంది. మూడో నాలుగో దీపాలు ఉన్నయ్ - తీగల పట్టుకొని ఊగిసలాడుతూ. గ్రుడ్డిదీపం ఒకటి గోడను అంటిబెట్టుకొని గ్రుడ్లు తెరుచుకుని చూస్తుంది! క్రింద మసకచీకట్లు యిటూ అటూ దోబూచులాడుతున్నయ్.

"నాయుడుగారూ!" అని ఎవరో పిలిచారు ఆ యింటి మొగన అంతవరకూ ఊగుతూన్న లైటు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డది. రెండుమూడు కేకలకు దొడ్లోంచి కేక వినపడ్డది. "వస్తున్నా!"

"ఒహో నువ్వటయ్యా! రా కూర్చో. సంజవేళ కొచ్చావ్?"

"అదిగాదండి నాయుడుగారూ! మిమ్మల్ని గట్టిగా అడగలేకపోతున్నా ఆ డబ్బు కాస్త..."

"ఇటు రావయ్యా..ఇలా కూర్చో. ఒళ్ళో పెడుదునా, దళ్ళో పెడుదునా అని మాట్లాడితే ఎలా? రారా! యిలా కూర్చో. అబ్బాయి మళ్ళీ యివాళ ఉత్తరం వ్రాశాడు. వాడికి ఏదోపరీక్షఫీజు కట్టవలసివచ్చిందట. ఆది ఎలాగునా... అని ఆలోచిస్తున్నా. ఇప్పుడే తొందరచేస్తే ఎలాచెప్పు?"

"ఇంకా ఎంతకాలమండీ? నాలుగేళ్ళాయే. వడ్డీ పెరిగిపోతూంది. ఏదో ఫైసలుచేయించండి. మరి పోతా."

ఒక్కసారి దీపం భగ్గున మండి మళ్ళీ మామూలుగా అయింది. వీధితలుపులు గుభాలునపడ్డయ్. నాయుడుగారు కుర్చీలో కూలబడ్డారు. చాలా చికాకుగా ఉన్నట్లున్నారు.

"ఏమేవ్! యిలారా!...ఇక్కడ నేవున్నావ్? సరి" గట్టిగా మూలిగాడు తడబడుతూ.

"ఎందుకండీ?"

ఎ. ఎస్. ఆర్. అంజనేయాచారి

"మరేంలేదు మంచినీళ్లు కాస్త పట్రా."

నాయుడు అలమరా వైపు నడిచారు. భార్య మంచినీళ్ళు తేవటానికి వెళ్ళింది. అలమారు దగ్గిర గాజుగ్లాసు బ్రద్దలైంది. భార్య పరుగునవచ్చి,

"ఏమిటండి అదీ?" అని ఆదుర్దాగా అడిగింది.

"ఛా! ఛో! ఏంలేదు."

"ఏంలేకంటారే...అయ్యో కాళ్ళకు గాజు పెంకులు గ్రుచ్చుకొన్నయ్! రక్తం వస్తున్నది."

చెంప బ్రద్దలైంది భార్యకు. "ఛో యిక్కడ నుండి"అని గర్జిస్తూ నాయుడు గాయాన్ని చూసుకుంటూ కుర్చీలోకూలబడ్డారు. జలజలా రాలాయి భార్య కళ్ళల్లోంచి కన్నీళ్లు. అలమారాలో సారా బుడ్డి వెలవెలబోయింది గ్రుడ్డివెలుగులో. "మళ్ళీ మొదలుపెట్టారా యీ త్రాగుడు?" పాపం ఆమెకేం తెలుసు రోజూ అలవాటేనని. దొంగతనం బయటపడ్డందుకు మహాబాధ పడుతున్నారు నాయుడుగారు.

ఎవరూ కొంతసేపటివరకు మాట్లాడలేకపోయారు.

"చదువు సంస్కారం గలవారు, ప్రజల్లో పెద్దలు, మద్యనిషేధ ప్రచారకులు, వివాదరహిత పరిజ్ఞానవంతులూ అయిన తమరు యింత అసహ్యంగా ప్రవర్తిస్తుంటే మరేంచెప్పాలి నేను?" గద్గద కంఠంలో తొణికిసలాడే గంభీరవాక్కులు వెలువడ్డాయి ఆమె నోటినుండి.

"సుశీ! నోర్మూయ్!"అధికారం అజ్ఞాపించింది.

"నోరు మూసుకుంటాను."

"అట్టే వాగకు!"

"వాగను."

"అధికప్రసంగి!"

"అవును."

"ఎక్కడివా తెలివితేటలు? ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?"

"చదువుకున్న నోటినుండి వచ్చాయి విజ్ఞాన సంస్కారాలుగల భర్తతో మాట్లాడుతున్నాను."

"మళ్ళీ కావాలా? రాస్కెల్!"

"కావాలి. పచ్చటి సంసారాన్ని పాడుచేస్తున్నారు. వయస్సు పెరుగుతున్నా వ్యామోహాలు ఎక్కువ కావాలి. ఉపన్యాసాలు చెబుతున్నా ఊసుబోయేందుకు సారా..."

జుట్టుపట్టుకుని ఒక్క గుద్దువేశారు నాయుడు. ఆయాసం వచ్చేంతవరకు కొట్టికొట్టి అలసిపోయి చతికిలపడిపోయారు పాపం.

"మనస్సుని దుర్బలం చేసుకోకండి. జీవితాన్ని నాశనం చేయవద్దు. ఎందుకీ త్రాగుడు చెప్పండి? ఆస్తినంతా ధ్వంసంచేశారు. ఉన్న ఒక్క కొడుక్కీ చదువుచెప్పించలేక బాధపడుతున్నాం."

"ఇంకా అరుస్తావేం శనిదేవతలా. ఛో! యిక్కడినుంచి. ఛా! నేనే పోతాను"అంటూ చరచరా పోయాడు నాయుడు వీధిలోకి. సుశీల స్తంభం దగ్గిరనే కూలబడిపోయింది.

* * *

"ఏంబాబూ యిలావచ్చారు యీ రాత్రేళ?"

"ఏంలేదురామయ్యా నీతో కొంచెం పనుండి."

"రండిబాబూ రండి. అహా అలా కుర్చీలో కూర్చోండి."

"విన్నావుగా..."

"అహా! విన్నాను బాబూ విన్నాను. నిన్న మీరు ఉపన్యాసం చెబుతూంటే అందరూ అలా నివ్వెరపోయి విన్నారు బాబు. మద్యం తాగ్గూడదని తమరు శలవిస్తుంటే మాలాంటోళ్ళందరూ లెంపలేసుకున్నారనుకోండి. మళ్ళీ ఎప్పుడూ జనమలో దాన్ని ముట్టుకోకూడదని."

"అ దానికేంలేవోయ్! అది కాదు నే చెప్పేది మా అబ్బాయి సంగతి."

"ఏమిటిబాబూ! చిన్నబాబు చదుకొంటున్నాడుగా!"

"ఆ! అదేనోయ్. వాడునన్ను చంపేస్తున్నాడు. వెధవచదువూ వాడూను. ఎంతసేపూ డబ్బు డబ్బు."

"అదేలే బాబూ! పట్నం చదువు కదూ? డబ్బుతో పని."

"మళ్ళీ నిన్న వెధవ టెలిగ్రామ్ యిచ్చాడు వందరూపాయలు పంపమని. సమయానికి ఎవరిస్తారుచెప్పు? మొన్న నాచేతిలో డబ్బుపెట్టి అన్నదానసమాజందగ్గర చలువపందిరి వేయించా. ఇంతత్వరగా కావాలంటే ఎలావస్తుంది."

"మీకేంబాబూ. మీపలుకుబడి, మీమర్యాద పెద్దపెద్దవాళ్ళంతా మీయింటికి వస్తారు. తమరు అడగాలేగాని వేలకువేలురావూ?"

"ఒకర్ని అడిగే బాపతు కాదోయ్ మనది! దేశసేవకై కంకణంగట్టుకొన్న మాబోటి ప్రతి వ్యక్తీ వ్యక్తిగతస్వార్థాన్ని పోగొట్టుకోవాలి."

"బాగా సెలవిచ్చారు బాబూ. తమలాంటి వారుండబట్టే యింకా యిలా ఉన్నాం బాబూ"

"ఇదుగో రామయ్యా! నీ దగ్గరవుంటే సర్దు. మళ్ళీ వారంలో యిచ్చేస్తాను."

"ఛ ఛ!! ఎంతమాట! నావద్ద ఉంటే యింత సేపా - మిమ్మల్ని యింతవరకూ కూర్చోబెట్టే వాడినా..తప్పదియ్యా! ఉండండి బాబు మావోళ్ళ దగ్గర ఉండాదేమో అడిగొస్తాను."

"ఏంఫరవాలేదులే. మళ్ళీ యీరోజున యిచ్చేస్తాను."

"ఎంతమాట! ఉండండి వెళ్లొస్తా."

* * *

"ఏంరామయ్యా! ఏమయింది? తెచ్చావా?"

"లేదుబాబు. ఉన్నదంతా మొన్న వ్యాపారం..."

"అన్నట్లు నీవ్యాపారంబాగాసాగుతోందా?"

"అబ్బెబ్బె! ఏం వ్యాపా...రం...బాబూ. ఏంలేదు."

"అహ. అలా ఖంగారు పడతావేం పిచ్చి వాడా! మనలో మనమేగా. ఎలా ఉంది వ్యాపారం?"

"ఊహు! లేదుబాబూలేదు. మీరు మొన్న ఉపన్యాసం చెప్పాక బుద్ధి ఒచ్చింది బాబూ. దానిజోలికి మళ్ళీ వెళ్ళనని ఒట్టేసుకున్నాను. ఇంక దానివ్యాపారం చేయడంలేదుబాబూ!"

"పోనీలేవోయ్ ఆ ఉపన్యాసాల గొడవ. లోగడ స్టాకు ఏమైనా ఉందా?"

"లే...లేదుబాబూ! ఏదో ఒక డ్రాము అర డ్రాము ఉంటుందేమో బాబు - అంతే. అదీ పారబోసేద్దా మనుకొంటున్నాను బాబు"

"వద్దొద్దు!! పారబోయలేదుగదా! ఇదిగో యిలారా! మనలో మనమాట. అదియిలా పట్రా నాకు."

"మీ...కా...బాబూ??"

"ఫరవాలేదులేవోయ్. కడుపునొప్పి చంపేస్తోంది ప్రొద్దుటనుండి. ఏదో ఔషధంగా నేగా."

"స...రే...తెస్తానుండండి బాబూ."

"నేనూ వస్తానులే పద. ఇక్కడఉంటే వెధవ లెవరైనావచ్చి పిచ్చిగా అనుమానపడి కుక్కల్లా వాగుతారు."

"ఇదేమోయ్ చాలాఉందీ! రెండుమూడు సీసాలున్నయ్! మంచివాసన వేస్తుందే...ఏదీ మరోగ్లాసుయివ్వు...చాల్లే హాయ్‌హాయ్! శహ దాష్! బాగుందోయ్ రామయ్యా! వెయ్యేళ్ళు బ్రతుకు!"

"ఏదోబాబు. మీలాంటివోరి దయ ఉండాలి గాని వెయ్యేంటి లెక్కాబాబూ?"

"ఇంకాఎక్కువ బ్రతకాలని ఉందేమిటోయ్? సరే బ్రతుకు."

"ఏదిమరి డబ్బు యిస్తావా?"

"ఇదుగో తెస్తాబాబు." ఇందాకలేంది ఇప్పుడొచ్చింది పాపం.

"ఏంది బాబయ్యా! మరో గ్లాసు పట్టేశారు? నేనువచ్చి యివ్వకండీ! మీరే తీసేసుకున్నారు."

"ఆ! వెధవ కడుపునొప్పి మా చెడ్డదోయ్. బలే ఖుషీగా ఉందిలే."

"రాత్రే వచ్చింది బాబు సరుకు నికార్సైంది"

"ఏదిడబ్బు? ఇలా తే. భలేవాడివి రామయ్యా! నువ్వు భారతదేశానికిమణిపూసలాటోడివి. నీలాటి వాళ్లు దేశంకోసం కొందరుండాలి. ఉండాలంటే ఉండాలి. దేశమంటే ఎవరనుకున్నావ్? మనం! మాలాంటి నాయకులకు నీలాంటివాళ్ళు ఎంతో మంది కావాలి..."

"ఏదో బాబూ తమదయ అలా అనిపిస్తుంది. అయితే బాబూ మునిసిపాలిటీ ఎలక్షన్లు ఎప్పుడు జరుగుతాయి?"

"ఓ! వేసేశావు కోటలో పాగా. బాగుంది. ఎంతైనా బాగుంది. రామయ్యా! ఇంకేం నిన్నో వార్డుకు నిలబెట్టేస్తేసరి. ఆ! నీకేమోయ్? మేడ కట్టించావు. రెండుడబ్బులా చేతులున్నయ్....ఆ రెండు చేతులా డబ్బుంది. ఏం... భేష్! తరువాత ఆలోచిద్దాం. వస్తానుమరి... మాట! ఎవ్వరికీ తెలియనియ్యకేం? వెధవలు లోకులుకాకులు."

"ఎంతమాట బాబు! నా ప్రాణం పోవాల. వెళ్ళండిబోబూ! రెండువందల రూపాయలు పద్దురాయనా?"

"రాసుకోవోయ్! నీ యిష్టమొచ్చినంత వ్రాసేసుకో..."

"చీకటి పడ్డది బాబూ! లైటు కావాల్నా?"

"ఛీ! వద్దు. మనకి అలానే ఉండాలి. వెధవలు చూస్తారు." తూలుతూ సోలుతూ నాయుడు యింటికి జేరుకున్నాడు.

*   *   *

"తలుపు! తలుపు! ఒసేవ్ రాస్కేల్."

"తీస్తున్నానండి."

"చచ్చావు, తియ్ త్వరగా." సుశీల తలుపు తెరిచింది.

"అయ్యో!ఇదేమిటండీ నుదురుమీద బొప్పి?"

"ఏడిశావ్! వాక్కు. నీకేం? నీకేమంటు? తోవలో లాంతరు స్తంభాన్ని ముద్దెట్టుకున్నాను. అది నా ప్రియురాలు. మధ్య నీవెవరు? ఫో."

"ఇంతరాత్రప్పుడు ఎక్కడకు వెళ్ళారు? భోజనానికి లేవండి. అయ్యో! వాసన. ఛీఛీ. మళ్ళీ ఏ కొంపలోకిపోయి త్రాగొచ్చారు? ఇంట్లోనేకాక బయటకూడా ఇదేం ఖర్మండీ?"

"ఇదిగో సుశీ! ఇటురా!" కూర్చిలో కూర్చున్న నాయుడుగారు పిలిచారు.

"ఎన్నిసార్లుచెప్పినా మానరేం యీతాగుడు? మన పరువు మర్యాదలు మంటకలిసిపోతున్నయ్: నలుగురికీ తెలుస్తే ఏమనుకుంటారు?"

"ఏమనుకొంటారు వెధవలు. తుపాకీతో పేలుస్తా. రాస్కేల్! పిచ్చిగా వాగుతావ్! నేను తాగేనా? చంపేస్తా. నువ్వు తాగావ్!"

"సిరిసంపదల్లో పుట్టి, ఉన్నతమైన గౌరవ మర్యాదలను పొంది లోలోపల యిల్లు ఒళ్ళు గుల్ల చేసుకుంటూ చేసే యీ అవినీతి కార్యాల....."

"నోర్ముయ్!" గర్జించాడు ఒక్కసారి.

"పిచ్చిముండా! మన గౌరవం! మన మర్యాద! మనకేమే దర్జా. దేశాన్ని ఉద్ధరించేది మేమేనే. రేపు ఎలక్షన్లు ఉన్నాయి చూశావ్? అందులో యీ పిచ్చి వెధవలందరూ మనల్ని ఎన్నుకుంటారు. అప్పుడు చూసుకో మనం ఒక అమాత్యులం. మన ఇల్లొక అందాలమేడ. మనకొక సారాబుడ్డి. మనం స్వర్గంలో విహారిద్దాం ఏం? బాగుందా? బాగుంది చాలాబాగుంది. ఆ మరచా నిన్ను యిలా రమ్మని పిలచానే వినిపించడంలా?"

"చెప్పండి ఇక్కడే ఉన్నానుగా."

"చఫ్ ఇలారా కూర్చో. ఇదిగో డబ్బు రేపు వాడి మొఖానికి పంపించు. మూడువందరూపాయలు!"

"ఏదీ వందల రూపాయలేగా?"

"ఏడిశావ్ నాలుగువందలు! నా ఫ్రెండు చెప్పాడు తెలుసా?"

"అయ్యో నాకు తెలీదండి. మీ ఎదుటనేగా లెక్కబెట్టాను."

"ఫో రాస్కేల్! ఇలారా నువ్వు!"

"అబ్బ కొట్టకండి! నాకు తెలియదు. అర్థం లేకుండా పిచ్చికేకలు వీరున్నా."

"నేను కొట్టానటే ఊరికే యిలా అంటే."

"మీరు అనవసరంగా మాట్లాడుతున్నారు. కొంచం పడుకోండి."

"నేను అనవసరంగా మాట్లాడుతున్ననటే! ఎవడన్నాడు వెధవాయ్ చెప్పు! వాడి డొక్క చించేస్తాను. నేను కాబోయే మంత్రిని."

"అర్థంకాని మాటలు కాకబోతే మరేమిటి? జ్ఞానం ఉన్నప్పుడే చెప్పేదొకటి చేసేదొకటి గదా! ఇప్పు డీసమయంలో ఎలా ఉంటాయ్? ఇంక పుణ్యముంటుంది మీరు కాస్త పడుకోండి."

"పడుకుంటాను ఫో! నాయిష్టం నేను త్రాగుతాను పడుకొంటాను నువ్వెవతివే చెప్పటానికి?" తలుపు గబాలున వేసేశాడు నాయుడు సుశీల యింకా తలుపుదగ్గరే నిలబడింది పాపం.

తాను కాపురానికి వచ్చినప్పు డనుకొంది తన భర్త దేశోద్ధారకుడు కీర్తికాముకుడని. కాని లోగుట్టు పెరుమాళ్ళకెరుక. మానవవ్యక్తిత్వం ఎంతలోతైనదో. లౌకికనాటకానికి నటుకుడు మానవుడు పచ్చిమోసగాడు. కాని అందరూ అలా ఉంటారా? సుశీల చదువుకున్న సంస్కారిణి. విశాలభావాలుకలది. తాను మాతృదేవి. యిప్పుడు తన చిన్నబాబు పెద్దవాడయ్యాడు. సంసారంలో దుఃఖాన్నంతా దాచిపెట్టుకుని పెంచింది. పట్నం పంపారు చదువుకని. తమ కుటుంబాన్ని అతడైనా వృద్ధిలోనికి తెస్తాడని ఆశపెట్టుకుంది.

మరపురాని ఆవేదన ఆ రాత్రంతా ఆమెను శోకంలో ముంచి ఎత్తింది. పక్షులు కిలకిలతో

అరుణోదయ కాంతులు ప్రసరిస్తున్నయ్. ఆమెలేచి గృహకృత్యాలు చేసుకోబోయింది.

వీధి అరుగుమీద పెద్దలు వేంచేశారు. నాయుడు గారు పరిపూర్ణ తేజోవంతములు, అత్యవసర సముపార్జితములు అయిన ఖద్దరు బట్టలు, ఖద్దరుటోపీ ధరించి రెండుగంటల ఆలస్యంతో దర్శనమిచ్చి ఆశీనులయ్యారు పెద్దలముందు. రాజకీయాలన్నీ దొర్లిపోయాయి. గ్రామాభివృద్ధి ప్రణాలికలు చేయబడ్డాయి. రాబోయే ఎలక్షన్ల విషయాల్లో తర్జనభర్జనలయ్యాయి. పదిగంటలు అయేసరికల్లా అప్పటికే చాలా కాలాతీతమైంది. లెండికని కార్యక్రమాలని చంకనుబెట్టి యిండ్లకు పోయారు. నాయుడుగారు మరచిపోకుండా పుత్రునికి డబ్బు పంపారు.

ఆ గ్రామం అంతా అదో సందడిగా వున్న దంటే నమ్మండి. నాయుడుగారింటిముందు కార్లు ఆగుతున్నయ్! పోతున్నయ్! సినిమా బొమ్మలు అంటిస్తున్నట్లు కుర్రాళ్ళు ఎలక్షన్ ప్రోపగాండా బొమ్మలు అతికిస్తున్నారు.

అప్పుడే పోస్టువాడు ఒక కవరు తెచ్చారు నాయుడుగారికి. ఠీవిగా కుర్చీలో ఆసీనులయిన నాయుడుగారు కవరు చించారు.

శ్రీ రాజయ్య నాయుడుగారికి!

మీ కుమారుని స్నేహితుడు వ్రాయునది. ఇప్పటికి వారం రోజుల క్రిందట మీ అబ్బాయిని దొంగతనం (అయిదువేల రూపాయలు) చేశాడన్న నేరంపై పోలీసువాళ్లు అరెస్టుచేసి ఖైదులో ఉంచారు. మరొక సంగతి డబ్బు కట్టనందువలన పరీక్షలకు కూర్చొనలేదు. అందువలన యీ సంగతులు తెలియపర్చడమైనది.

మీ విధేయుడు,
రాము.

ఉత్తరం చదువుతూన్నంతసేపు భూమి కంపిస్తున్నట్లుందినాయుడుగారికి. క్రోధమంతా ఒక్కసారి నాయుడుగారని పూనినట్లు ఊపేస్తుంది. భార్యను పిలిచి నాలుగుతిట్టడం మొదలుపెట్టాడు. సుశీలకు అర్థంకాలేదు. ఉత్తరం చదివి నేలమీద కూలిపోయింది ఆమె.

"వెధవ! నా పేరునంతా నాశనంచేయడానికి తయారయ్యాడు. నాలాంటివానికి యిటువంటి దుర్మార్గుడు జన్మించాడు. పదిమందిలో నన్ను అప్రతిష్ఠపాలు చేశాడు." ఇంకాయింకా ఏవేవో చాలా తిట్టారు— తనొక బుద్ధిమంతుడైనట్లు.

కాకోసమైనా వాడిని గుట్టుగా విడిపించాలి. ఈ ఎలక్షన్లలో యీ విషయం బయట తెలిస్తే, ఏమైనా ఉందా? చూడు వాడినేంచేస్తానో... ప్రయాణానికి సిద్ధంచెయ్...అయినా పోలీసు వాళ్ళకు ఏలా బుద్ధిలేదంట? తాను. తన హోదా వాళ్ళకు తెలియనక్కర్లా... నాయుడుగారు సుపుత్రుని విడిపించేందుకు మద్రాసు బయల్దేరారు. సుశీల ఏడుస్తుంది—ఈ తండ్రీ కొడుకులు యిద్దర్లో తన కుటుంబాన్ని ఎవరు ఉద్ధరిస్తారో ఆమెకు అర్థమవలేదు— తండ్రికి మించినవాడు కొడుకు. కొడుక్కుమించినవాడు తండ్రి. వీళ్ళే భావిభారతానికి యశోకీర్తులను సంపాదించిపెట్టేవారు!

గాంధీపటం గోడకు వ్రేలాడుతూంది. సుశీల కన్నీటితో బోసినోటి తాతకు చేయెత్తి నమస్కరించింది.

"పిచ్చిదానా! మానవుల నైజగుణాలంతే. ఎందుకలా ఏడుస్తావ్? లౌకిక ప్రపంచం యిది. మంచివాళ్లకు ఈ ప్రపంచంలో చోటులేదమ్మా!" అని ఓదారుస్తున్నట్లు చేత్తో సంజ్ఞచేస్తున్నాడు గాంధీతాత.

---

విధిలేక రెండోపెళ్ళి భర్తను కట్టుకున్న ఒకచురుకైన అమ్మాయి పుట్టింటికి వచ్చింది. స్నేహితురాళ్లు ఆమెను పరామర్శిస్తూ "మీ ఆయనకి నిజంగా ఎంత వయస్సుంటుంది?" అని అడిగితే—

—అమ్మాయి చెప్పిన సమాధానం: "సరిగ్గా ఆయన వయస్సెంతో నాకు తెలీదుగానీ, వాలుకుర్చీలో పడుకోబెట్టి ఒక కప్పు కాఫీయిస్తే, అది తాగేసరికి ఆయనకి నిద్దరొచ్చేస్తుంది.